

# సత్యవాక్కు

## క్రైస్తవ మాస పత్రిక

THE WORD OF TRUTH

## మీకొక సదవకాశము !

క్రీస్తు సంఘములు సమర్పించుచున్న "సత్యవాణి" యను రేడియో కార్యక్రమముద్వారా లక్షలాది ప్రజలు గొప్ప ఆత్మీయ మేలులను పొంది యున్నారు. మరికొందరు మేము ప్రచురించిన తెలుగు పుస్తకములద్వారా మేలు పొంది యున్నారు.

మీరు బైబిలు సత్యములను సులువుగా గ్రహించు నిమిత్తము మేము ముద్రించిన సత్యవాణి రేడియో ప్రసంగములు, తదితర పుస్తకములు 20 రకములు మావద్ద ఉన్నవి. అవియేగాక రాబోవు రెండు సంవత్సరములలోను సత్యవాక్కు మాసపత్రికను మీరు క్రమముగా పొందవలెనంటే ఈ దిగువ చిరునామాకు రూ. 15/- లు మాత్రము పోస్టేజీ ఖర్చులకు పంపించి మీ పేరు నమోదు చేయించుకొనండి ! మీ యింటిలో ఒక మినీ క్రైస్తవ గ్రంథాలయాన్ని తెరవండి ! !

**SATYA VANI**
(P.O. Box 80) Seshagiri Rao St.
KAKINADA_533 004

గమనిక :- మీరు M.O. పంపునప్పుడు, మాకు ఉత్తరములు వ్రాయునప్పుడు, మీ అడ్రసులో మార్పు కలిగినప్పుడు మీ సత్యవాక్కు నంబరును మాకు తెలియ జేయుడి. ఇది అత్యవసరం ! !

రాజన్ ప్రెస్, కాకినాడ.

# సత్యవాక్యం

**THE WORD OF TRUTH**

P.O. Box 80, KAKINADA, A.P. 533 001

**Editor :** J.C. CHOATE

**Managing Editor :** JOSHUA GOOTAM

**Pleading for Restoration of First Century Christianity**

సంపుటి **11** సెప్టెంబరు **1990** సంచిక **2**

## సంపాదకీయము

### ప్రజలయొద్దకు సువార్తను ముఖాముఖీగా తీసుకొనివెళ్లుట

### (Confronting People with the Gospel)

నేడు సంఘము అవసరమైన అభివృద్ధిని పొందకపోవుటకు ఒక కారణమేమనగా మనము సువార్తను ప్రజలయొద్దకు ముఖాముఖీగా తీసుకొని వెళ్ళకపోవుటయే. మనం ప్రజలమధ్య జీవించుచున్నాము, వారితో పని చేయుచున్నాము, ప్రయాణించుచున్నాము, వారితో సంబంధాన్ని కలిగియున్నాము, కాని ప్రభువును గూర్చి మనము వారితో మాటలాడుటలేదు. మనము సత్యమునే పలుకుచున్నామని, నీతిమంతులమని, ఆరాధనకు హాజరగుచున్నామని, ప్రభువు మాటను అనుసరించుచున్నామని తలంచుచున్నాము. మనము అట్టివారమైతే, మన స్నేహితులను క్రీస్తులోనికి మార్పు చేసినంతమాత్రాన చాలదు. మనము ప్రజలయొద్దకు సువార్తను ముఖాముఖీగా తీసికొని వెళ్ళి

ప్రభువు కొరకు వారి అవసరతను గూర్చి పూర్తిగా రక్షింపబడుటకు వారేమి చేయవలసి యున్నదో వారికి తెలియజేయువలెను.

సువార్త అంటే ఏమిటో తెలియకుండ ప్రజలకు దానిని గూర్చి తెలియజేయలేము. దీనిని గూర్చి ఒక్క నిమిషం ఆలోచిద్దాం. సువార్త అనగా మంచి వార్త లేక సంతోషకరమైన వార్త (రోమా 10:15). క్రీస్తు మరణ, సమాధి, పునరుత్థానములు దీనికి ఆధారము (1 కొరింథీ 15 : 1-4). ఒకని మరణము మంచి వార్త ఎట్లగును? ఎందుకనగా మనము రక్షింపబడుటకు క్రీస్తు చనిపోయెను. ఆయన పునరుత్థానము మనకు పునరుత్థానమును గూర్చిన నమ్మకమును కలిగించుచున్నది.

ఒకడు ప్రభువునకు విధేయుడగునప్పుడు క్రీస్తు మరణ సమాధి పునరుత్థానములలో పాలుపొందుచున్నాడు. ఒకడు మారుమనస్సు పొంది పాపముల విషయమై మరణించుట ద్వారా క్రీస్తు మరణములోను, నీటి సమాధియైన బాప్తిస్మము పొందుటద్వారా ఆయన సమాధిలోను, నీటి సమాధిలోనుండి నూతన జీవము పొందినవారమై లేపబడినప్పుడు ఆయన పునరుత్థానములోను పాలుపొందుచున్నాడని పౌలు చెప్పెను (రోమా 6:1-13). రోమా 6:17లో మనము పాపమునకు దాసులమని, ఆ ఉపదేశ క్రమమునకు లోబడిన తరువాత నీతికి దాసులైతిమని బోధింపబడియున్నది. ఆ ఉపదేశక్రమము మరణ, సమాధి పునరుత్థానములు అనగా పాపముల విషయమై మరణించి నీటి సమాధి చేయబడి నీటి బాప్తిస్మము ద్వారా పునరుత్థానము పొందుటయే. అదే పనిని ఐతియోపీయుడైన మనుష్యుడు అ. కా. 8:26-39లో జరిగించెను.

ఒకడు సువార్తను విశ్వసించవలెను. సువార్త అనగా క్రీస్తు మరణ సమాధి పునరుత్థానములు. విశ్వాసము, మారుమనస్సు, క్రీస్తు దేవుని కుమారుడని ఒప్పుకొనుట మరియు బాప్తిస్మము అను ఈ

ఆజ్ఞలు రోమా 6లో నున్న ప్రభువు మరణ సమాధి పునరుత్థానములను తెలియజేయుచున్నవి. ఒకడు ఈ ఆజ్ఞలకు విధేయుడైనప్పుడు క్రీస్తు మరణ సమాధి పునరుత్థానములను విశ్వసించుచున్నట్లు అర్థము. ఒకడు ఈ ఆజ్ఞలకు విధేయుడైనప్పుడు ప్రభువుయొక్క మరణ సమాధి పునరుత్థానములను మనకు జ్ఞాపకము చేయుచున్నాడు.

ఒకడు సువార్త వలన రక్షింపబడుటకు సువార్త యొక్క ఆజ్ఞలకు విధేయుడు కావలెనని ప్రభువు కోరుచున్న కోరిక ఇందు వ్యక్తమగుచున్నది. క్రీస్తు తిరిగి వచ్చి దేవుని ఎరుగని వారికి మన ప్రభువైన క్రీస్తు సువార్తకు లోబడనివారికి ప్రతిదండన చేయునని పౌలు చెప్పెను (2 థెస్స 1:7-9). పౌలు ఈలాగు ప్రశ్నించెను: "అది మన యొద్దనే ఆరంభమైతే దేవుని సువార్తకు అవిధేయులైన వారి గతి యేమవును?" (1 పేతురు 4:17).

సర్వలోకమునకు వెళ్లి సువార్తను ప్రకటించుమని క్రీస్తు మనకు ఆజ్ఞాపించెను (మార్కు 16 : 15-16). రక్షణ కలుగజేయుటకు అది దేవుని శక్తియై యున్నదని పౌలు చెప్పెను (రోమా 1:16). దీనిని మరుగు చేయుటకు అతడు సాహసించలేదు (1 కొరింథీ 9:12). మరొక సందర్భములో అతడు ఈ విధముగా పలికెను. "మా సువార్త మరుగు చేయబడినయెడల నశించుచున్నవారి విషయములోనే మరుగు చేయబడి యున్నది" (II కొరింథీ 4:3). నీవు సువార్తను మరుగుచేయుచున్నావని, దాన్ని అలక్ష్యముచేసి నిరుపయోగమైనదిగా చేయుచున్నావని నీకు తెలియునా? ఒకడు ఆలాగు చేయుట ఎట్లు? ఈ మంచి వార్తను అందుబాటులో ఉన్నవారికి బోధించకుండ యుండుటవలన కదా! "నేను సువార్తను ప్రకటింపకపోయిన యెడల నాకు శ్రమ" (1 కొరింథీ 9:16).

ఈ మహదైశ్వర్యము (సువార్త) మంటిఘటములలో (మనలో)

ఉంచబడెనని బోధింపబడి యున్నాము. క్రీస్తు సువార్తకు విధేయులమై రక్షింపబడిన మనమెంత ధన్యులము! మనమిట్టి జ్ఞానము కలిగి యితరులకు అందించుట ఎంత ధన్యకరము! మనము ఇతరులకు దీనిని గూర్చి తెలియజేయకుండ దేవుని చిత్తమును గూర్చిన జ్ఞానమును, రక్షణను తిరస్కరించుట ఎంత సిగ్గుకరము.

సువార్తను గూర్చి కొందరితో మాటలాడుటకు అనేక అవకాశములు నిస్సందేహముగ దొరికినప్పటికిని సువార్తను అందించుటలో మనము విఫలమగుచున్నాము. నీవు తండ్రి లేక తల్లివైతే మీ బిడ్డకు ఒక వచన భాగాన్ని గాని, పద్యాన్ని గాని, లేక ఒక కథనుగాని వివరిస్తూ యుండవలెను. నీవు నీబిడ్డ విషయమై గర్వించునట్లును, అతడు మంచిపని చేయగలుగునట్లును, అట్టి పనిని అతడు ప్రారంభించునట్లు నీవు ఓపికతో కనిపెట్టగలవు. అతడు సందేహించి, భయపడి అతని పనిని మరచిపోయినప్పుడు నీవు వెనుకనుండి "వెళ్ళు, భయపడకు, నీవు ఆ పనిని చేయగలవు" అని ప్రోత్సహిస్తావు. ప్రభువు పిల్లలుకూడ తమ స్నేహితులతో వాతావరణాన్ని గూర్చి, వారి పనిని గూర్చి, వారి కుటుంబాన్ని గూర్చి యింకా అనేక విషయాలు మాట్లాడునప్పుడు వారు ఆయననుగూర్చి, సువార్తనుగూర్చి, వారి రక్షణయొక్క అవసరాన్ని గూర్చి మాట్లాడవలెనని ఎదురుచూచుచున్నాడు. మన స్నేహితులతో ముఖాముఖిగా సువార్తనుగూర్చి మాటలాడుటకు అనేక అవకాశములు మనకు కలిగినప్పుడు మనము ప్రపంచములోని అనేక విషయాలను గూర్చి మాటలాడి సువార్తనుగూర్చి మాటలాడక పోయినయెడల అది ఆయనకు మిక్కిలి బాధను కలిగించును.

ప్రజలు ఆసక్తి కలిగిలేరనే పాతపాటను మనం చెపుతూ ఉంటాం. మానవుడు నశించిపోవుచున్నాడు. సువార్త రక్షించుచునే యున్నది. వారికి ఆసక్తి కలిగించవలసిన భారం మన మీద ఉన్నది.

ప్రపంచములో గొప్ప వస్తువు మనయొద్ద నున్నదనేది నిజము. మనము సత్యమును, రక్షణమార్గమును, నిత్యజీవము యొక్క నిరీక్షణను అందించే విషయాలు కలిగియున్నాము. మన స్నేహితులు ఆసక్తి చూపడంలేదంటే మనము మంచి అమ్మకపువారులము కాదు. మత సంబంధమైన మన స్నేహితులమాట ఏమిటి? ప్రపంచములో నాసి రకపు వస్తువులను వారు విక్రయించుచున్నారు. వారి సువార్తలు, వారి సంఘములు వారు ధరించిన పేర్లు అనుకరణలును మోసపూరిత మైనవి. మానవకల్పితములునై యున్నవి. అయినప్పటికిని వారు నశించుచున్న చాలామంది ప్రజలను వారు ఈ విషయాలను అంగీక రించునట్లు ఒప్పించి వారి స్నేహితులకు కూడ వీటిని విక్రయించు చున్నారు. ఆలాగు చేయుట ఎంత విచారకరము, మనయొద్ద స్వచ్ఛ మైన, నిష్కల్మషమైన దేవుని సత్యము ఉండి కూడ మనము వారి అవసరాన్ని బట్టి వారిని ఒప్పించలేకపోవుచున్నాము. మనకిదెంత సిగ్గు కరము. బహుశ మనము మార్పుచెందవలసి యున్నది.

నా సహోదరులారా మరియు స్నేహితులారా, మనము సువార్త విషయంలో ఏమిచేయుచున్నాము? మనము దానిని దాచి పెట్టి, యితరులతో పాలుపంచుకొనుటకు యిష్టపడకపోయిన యెడల మనము మారుమనస్సు పొంది ప్రభువునొద్ద క్షమాపణ అడగాలి. మరియు లేచి ప్రభువు పనిలో ముందుకు సాగాలి. సువార్తలో ప్రజల యొద్దకు వెళ్లుటకు, మనము విశ్వసించిన విధంగా ప్రజలు దానికి విధేయులగునట్లును విధేయులు కానియెడల నశించుదురని వారికి తెలియ జేయుటకు మనకెట్టి ఆటంకములేదు. మనము తక్షణమే వెళ్ళి దీనిని జరిగించుట అవసరమై యున్నది. మరోమాటలో చెప్పాలంటే మనము సువార్తను ముఖాముఖిగా ప్రజలయొద్దకు తీసుకొని వెళదాం. ఇప్పుడు అది నశించుచున్న వారి నిరీక్షణయే కాదు మననిరీక్షణకూడ

--0--

## సహోదరప్రేమ కలిగి యుండుడి

ఈనాడు ఎటుచూచినా అసహనం, అశాంతి, కక్షలు, కార్పణ్యాలు, అల్లర్లు అసూయ కనిపిస్తున్నాయి. ఆస్తులకోసం అన్నదమ్ములే పోరుచుకుచస్తున్నారు. పగా, ప్రతీకారములతో ఈ ప్రపంచమంతా నింపబడిఉంది. మనుష్యుల్లో ఒకరిపట్ల ఒకరికి దయాదాక్షిణ్యాలు లేవు. తోటివారిపట్ల కాస్త కూడా సహోదర ప్రేమ లేదు. సహోదర ప్రేమ లేకపోవడంవల్లనే ప్రతీ దేశంలో ప్రశాంతి కరువవుతుంది. అందుకే మానవకోటిని శాశ్వతంగా ప్రేమించిన ప్రేమాస్వరూపుడైన యేసుక్రీస్తు పలికిన మృదుమధురమైన దివ్యవాక్కులు: "సహోదర ప్రేమ నిలువరముగా ఉండనీయుడి ఆతిథ్యముచేయ మరువకుడి; దానివలన కొందరు ఎరుగకయే దేవదూతలకు ఆతిథ్యము చేసిరి" (హెబ్రీ 13:1). "మీరు ఒకరినొకరు ప్రేమింపవలెనని మీకు క్రొత్తఆజ్ఞ ఇచ్చుచున్నాను; నేను మిమ్మును ప్రేమించినట్లు మీరును ఒకరినొకరు ప్రేమింపవలెను. మీరు ఒకనియెడల ఒకడు ప్రేమగలవారైన యెడల దీనిబట్టి మీరు నా శిష్యులని అందరు తెలిసికొందురనెను (యోహాను 13:34, 35).

### ప్రేమలేని జీవితం వ్యర్థం

పువ్వులులేని తోట, ప్రేమలేని జీవితం వ్యర్థం. యేసుక్రీస్తు యొక్క ప్రేమను అందలి విశిష్టతను చవిచూచిన అపొస్తుడైన పౌలు ఇలా వివరించెను: "కాగా విశ్వాసము, నిరీక్షణ, ప్రేమ యీ మూడును నిలుచును; వీటిలో శ్రేష్టమైనది ప్రేమయే". ప్రేమలేనివాని జీవితం వ్యర్థమనియు చెప్పెను (1 కొరింథీ 13:13, 3). "ఎవడైనను ప్రభువును ప్రేమింపకుంటే వాడు శపింపబడుననియు నుడివెను" (1 కొరింథీ 16:22).

ప్రేమ తత్వాన్ని అనేకమంది గ్రహించలేకపోవుచున్నారు.

"ఎందుకనగా దేవుడు ప్రేమాస్వరూపి. ప్రేమలేనివాడు దేవుని ఎరుగడు" (1 యోహాను 4:8). "మన మొకనినొకడు ప్రేమించినయెడల దేవుడు మనయందు నిలిచియుండును; ఆయన ప్రేమ మనయందు సంపూర్ణమగును" (1 యోహాను 4:12).

"తన సహోదరుని ప్రేమింపని ప్రతివాడును దేవుని సంబంధులు కారు. మన మొకనినొకడు ప్రేమింపవలెననునది మొదటి నుండి మీరు వినిన వర్తమానమే కదా! మనము కయీనువంటి వారమై యుండరాదు. వాడు దుష్టుని సంబంధియై తన సహోదరుని చంపెను; వాడతనిని ఎందుకు చంపెను? తన క్రియలు చెడ్డవనియు తన సహోదరుని క్రియలు నీతిగలవియునై యుండెను గనుక (1 యోహాను 3: 10-12, ఆది 4: 4-8). కయీను క్రోధముతో తన సహో దరుని (సహోదరుని) హత్య గావించెను. చంపడమే కాదు ద్వేషించడము కూడా నరహత్యతో సమానము. ఏ నరహంతకునికి నిత్యజీవముండదు అని లేఖనములు హెచ్చరిస్తున్నాయి (1 యోహాను 3:15).

కనుక మనము అబ్రాహాము లోతుపట్ల చూపిన ప్రేమను మరియు యోసేపు తన అన్నదమ్ములపట్ల చూపిన నిష్కపటమైన ప్రేమ కలిగియుండాలి (ఆదికాండము 18, 19 అధ్యాయములు మరియు ఆదికాండము 45:1-15). అందుచే ప్రభువిట్లనెను. "మీ ప్రేమ నిష్కపటమైనదై యుండవలెను. చెడ్డదాని నసహ్యించుకొని మంచి దానిని హత్తుకొని యుండుడి. సహోదర ప్రేమ విషయములో ఒకని యందొకడు అనురాగముగలవారై ఘనత విషయములో ఒకని నొకడు గొప్పగా ఎంచుకొనుడి (రోమా. 12:9-15). కావున మనము తప్పిపోయిన చిన్న కుమారుని ప్రేమించలేని పెద్ద (కుమారుని) అన్నగా యుండకూడదు. ఈ పెద్దన్న తమ్ముడుపట్ల ద్వేషమును, అసూయను కలిగియుండెను. అందువల్లన ఈ పెద్దన్నవంటి స్వభావ

మును కాక మన అందరికి తన స్వరూపమును జీవమును, ఊపిరిని దయ చేసిన దేవుని స్వభావమును మనస్సును కలిగియుందము (ఫిలిప్పీ 2: 5; 1 పేతురు 3:8; II పేతురు 1:7).

## స్వపరీక్ష అవసరం

ప్రియ సహోదరులారా మనము దేవుని ఆజ్ఞను అతిక్రమింప కుండునట్లు సహోదరప్రేమ కలిగి యుండాలి. నేడు విశ్వాసులమధ్య సహోదరత్వము లేదు. ఎప్పుడూ ఒకళ్ళ తప్పులు, పొరపాటులు, బల హీనతలు ఎత్తి చూపించడమే కాని ఎవరికి వారు స్వపరీక్ష చేసుకో వడం అలవర్చుకోవడం లేదు. అందుచే దేవాదిదేవుడు ఈ విధముగా సెలవిచ్చుచున్నాడు: "నీ కంటిలోనున్న దూలము నెంచక నీ సహో దరుని కంటిలోనున్న నలుసును చూచుటయేల? నీ కంటిలో దూల ముండగా, నీవు నీ సహోదరుని చూచి నీ కంటిలోనున్న నలుసుని తీసివేయనిమ్మని చెప్పనేల? వేషధారీ, మొదట నీ కంటిలోనున్న దూలమును తీసివేసికొనుము, అప్పుడు నీ సహోదరుని కంటిలోనున్న నలుసును తీసివేయుటకు నీకు తేటగా కనబడును" (మత్తయి 7:3-5). మనలను బట్టి దేవుని శ్రేష్టమైన నామము దూషింపబడకూడదు (రోమా 2:21-25, గలతీ 6:1-5). మనము ఒకనినొకడు ప్రేమించుట విషయములో తప్ప మరేమియు ఎవనికిని అచ్చియుండవద్దు. పొరుగు వానిని ప్రేమించువాడే ధర్మశాస్త్రము నెరవేర్చినవాడు...ప్రేమ పొరుగువానికి కీడుచేయదు గనుక ప్రేమ కలిగి యుండుడి అని పౌలు రోమాలోని క్రీస్తు సంఘమును హెచ్చరించెను (రోమా 13:8-10). మనము మన తోటి పరిశుద్ధులను, ఇరుగుపొరుగు వారిని, క్రీస్తును గూర్చి ఆయన సంఘమునుగూర్చి తెలియని మతశాఖల ఊబిలో దిగబడిన వారిని ప్రేమించి వారికి దైవలేఖన సత్యములను వివరించి, వారి అవసరములలో, కష్టములలో పాల్గొనాలి (రోమా 12:13-18).

మరియు సువార్తికులు తమ తోటి సువార్తికులను, ప్రేమించి గౌరవించాలి మరియు ఇరుగుపొరుగు స్థానిక (క్రీస్తు సంఘ) సేవకులను ప్రేమించి వారికి చేయదగిన సహకారాన్ని ధన, వాక్యపరిచర్యల నందించుటద్వారా క్రీస్తు ప్రేమను వెల్లడిపరచాలి (II తిమోతి 2:15). నేడు చాలామంది సువార్తికులు, తమకంటె వయస్సులోను అనుభవములోను చిన్నవారైన యవ్వనస్థులను తమతమ స్థానిక సంఘ పరిచర్యలో చక్కగా వాడుకొని వారిచేత చేయవలసినంతే సువార్త పని చేయించుకొని వారి కనీస అవసరతలు గుర్తించకుండా ప్రవర్తించే కఠిన హృదయులు ఉండటం చాల విచారకరము. కొంతమంది సువార్తికులు సంఘంలో సార్వభౌమాధికారాన్ని చెలాయిస్తూ సంఘానికి తన భార్యపేరో లేక తనకు నచ్చిన ఏపేరైనా పెట్టుకుంటున్నారు. ఈ సంఘం మాది, దీనికి నాయకులం మేమే దీని పోషకులం మేమే యని సంబరపడేవారు కొందరు. కనుక ఇది తప్పు అని బోధించే ప్రతి క్రీస్తుసంఘ సభ్యునిపై, సువార్తికునిపై విరుచుకుపడుతున్నారు. ఒక్కసారి లేఖనాన్ని పరీక్షించ ప్రార్థన (మత్తయి 16:18, ఎఫెసీ 5:23-27). కనుక ప్రియ సహోదరి సహోదరా, నీ వింకను క్రీస్తునుగూర్చి ఆయన సంఘమునుగూర్చి తెలుసుకొననిచో తక్షణము మీ సమీపమునగల క్రీస్తు సంఘమును సందర్శించి సహోదరప్రేమతో వారు వివరించే దేవుని వాక్యం విని, విశ్వసించి, మారుమనస్సు పొంది, యేసుక్రీస్తు రక్షకుడని నోటితో ఒప్పుకొని, వాక్యానుసారమైన బాప్తిస్మం పొంది ఆయన రాజ్య (సంఘ) సభ్యులుగా మారి మనము ఒకరికొకరము ప్రేమ కలిగి యుండాలని మా కోరిక (1 థెస్స 4:9-12, 1 పేతురు 1 : 23, 1 పేతురు 2:17). నా ప్రియమిత్రులారా సహోదరప్రేమ కలిగియుండుడి. "క్రీస్తు సంఘము లన్నియు వందనములు చెప్పుచున్నవి (రోమా 16:16).

—పి. చంద్రశేఖర్, క్రీస్తు సంఘము, ధవళేశ్వరం.

# కాపరి

## ( Pastor )

"కాపరి" అనుపదము సువార్తికునికి లేక బోధకునికి లోకము వర్తింపజేయుచున్నది. మనము క్రీస్తును వెంబడించుచున్న యెడల (కొలస్స 3 : 17). ఈ పదాన్ని ఉపయోగించుటలో క్రొత్తనిబంధన క్రమాన్ని అనుసరించాలి.

1 తిమోతి 3, తీతు 1 మరియు 1 పేతురు 5వ అధ్యాయములలో కాపరులను గూర్చి చెప్పబడింది. క్రొత్తనిబంధన భాషలో కాపరి అనగా ఒక పెద్ద, ఒక అధ్యక్షుడు లేదా ఒక నాయకుడు. అతనికి ప్రత్యేకమైన అర్హత లుండాలి. ప్రతి సంఘములోను ఒకరికంటె ఎక్కువమంది కాపరులు (pastors) ఉండాలి. వీరు సంఘముద్వారా ఎన్నుకొనబడి సువార్తికునిచేత నియమింపబడుదురు (తీతు 1:5).

సువార్తికుని లేక బోధకుని పనిగాక వీరు ప్రత్యేకమైన పనిని నిర్వహించుదురు. బోధకుడు దేవుని వాక్యమును ప్రకటించును (2 తిమో 4 : 2). తిమోతి, తీతు బోధకులు. వారు కాపరులు లేక పెద్దలు కారు (2 తిమో 2:7). పౌలు అపొస్తలుడు మరియు బోధకుడు, అతడు కాపరి కాదు. అతనికి భార్య లేదు. కనుక ఆ పనిలో నియమింపబడుటకు అతనికి అర్హత లేదు (1 కొరింథీ 9:5). పేతురు అపొస్తలుడు, బోధకుడు మరియు కాపరి 1 పేతురు 5:1).

ప్రభువు చెప్పిన విధముగ బైబిలు విషయాలను బైబిలు పేర్లతో పిలుద్దాం.

—సెర్గా బార్టన్.

## "ఫేలిక్సులు కావద్దు"

(అ. కార్య 24 : 24-27)

మతాలకు అతీతమైనదై ...
మనిషికి ఆరోగ్యమును
మనస్సుకు ఆనందమును
చేకూర్చే హిత బోధను విని;
క్రీస్తును విశ్వసించలేదు ఫేలిక్సు !

ధనాపేక్షగల అధికారులకు
భక్తి శక్తి రాహిత్యులకు
శోధకులైన బోధకులకు
నిలువుటద్దము వంటి లేఖనం
శస్త్రమై చికిత్స చేస్తూంది !

మానవ పద్ధతులు విడనాడి
హిత వాక్య ప్రమాణం చేపట్టండి
క్రీస్తు బోధకు చెవి యొగ్గండి
విధేయులై మార్పునొందండి
దైవరాజ్య వారసులుకండి !

—యస్. జె. మేడిద, కొణితివాడ.

# ఇశ్రాయేలీయులు చేసిన పాపమేమి ?

దేవుని ఎదుటను క్రీస్తు ఎడలను ఇశ్రాయేలీయులు చేసిన పాపములు లేఖనములయందు పరిశీలిద్దాము.

"పిలాతు యేసును విడుదల చేయగోరి వారితో తిరిగి మాటలాడినను వారు వీనిని సిలువవేయుము, సిలువవేయుము అని కేకలు వేసిరి. మూడవమారు అతడు ఎందుకు? ఇతడు ఏ దుష్కార్యము చేసెను? ఇతనియందు మరణమునకు తగిన నేరమేమియు నాకు అగపడలేదు. గనుక ఇతని శిక్షించి విడుదల చేతునని వారితో చెప్పెను. అయితే వారు ఒకే పట్టుగా పెద్ద కేకలు వేసి వీనిని సిలువ వేయుమని అడుగగా వారి కేకలే గెలిచెను. కాగా వారడిగినట్టే జరుగవలెనని పిలాతు తీర్పు తీర్చి అల్లరి నిమిత్తమును, నరహత్య నిమిత్తమును చెరసాలలో వేయబడి యుండిన వానిని వారడిగినట్టు వారికి విడుదల చేసి యేసును వారి ఇష్టమువచ్చినట్లు చేయుటకు అప్పగించెను". (లూకా 23:23-25).

యేసు శాపగ్రస్తమైన సిలువ మరణము పొందుటకు అంగీకరించుటవలన నరహంతకుడైన బరబ్బాకు విడుదల దొరికెను. గాని క్రీస్తును సంహరించుటకు ప్రేరేపించిన ప్రధాన యాజకుల వలనను పెద్దలవలనను సిలువ వేయుమని కేకలువేసిన ప్రజలైన ఇశ్రాయేలీయుల వలనను విడుదల చేయబడ్డాడు బరబ్బా.

మరియు "దేవుడు నిశ్చయించిన సంకల్పమును ఆయన భవిష్యత్ జ్ఞానమును అనుసరించి అప్పగింపబడిన ఈ యేసును మీరు దుష్టులచేత సిలువ వేయించి చంపిరి" (అపో. కా. 2:23). అని అపొస్తలుడైన పేతురు వారి పాపములను ఎత్తి చూపించి బోధించెను. ఈ లేఖనమును బట్టి చంపినవారి కంటె చంపించినవారి పాపముకూడ ఘోరమైనదే.

"సహోదరులారా మీరును మీ అధికారులును తెలియక చేసిరని నాకు తెలియును, అయితే దేవుడు తన క్రీస్తు శ్రమ పడునని సమస్త ప్రవక్తలనోట ముందుగా ప్రచురపరచిన విషయములను ఈలాగున నెరవేర్చెను" (అ.కా. 3:17).

తెలిసిచేసినను తెలియక చేసినను నేరము నేరమే. గనుక ఈ విధముగా పాపులైరి.

"ఏలయనగా వారు దేవుని నీతిని ఎరుగక స్వనీతిని స్థాపింప బూనుకొనుచు దేవునికి నీతి లోబడలేదు" (రోమా 10:3).

స్వనీతిపరులైన ఇశ్రాయేలీయులు దేవుని నీతిమార్గము అనుసరింపని కారణమున రక్షణ అందుబాటులో ఉన్నను దానిని తిరస్కరించుటవలన పాపులై యున్నారని ఈ లేఖనము విశదపరచుచున్నది. స్వనీతిపరునికు రక్షణ దూరమని గ్రహించవలెను. దేవుని నీతిమార్గము ఎరుగని మత నాయకుల వలననే రోజుకొక మతశాఖ ఉద్భవించుచున్నది. ఈ పాఠము చదువుచున్న ప్రియ స్నేహితుడా! స్వనీతిపరులు స్థాపించుకొనిన మతశాఖలు విడిచి క్రీస్తు మార్గములోనికి వచ్చుట ఎంతో మేలు.

"పేతురు-మీరు మారుమనస్సు పొంది పాపక్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసుక్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి. అప్పుడు మీరు పరిశుద్ధాత్మ అను వరము పొందుదరు (అ.కా. 2:38).

పాపులైన ఇశ్రాయేలీయులు పాపక్షమాపణ కొరకు బాప్తిస్మము పొందిన విధముగా నీవును బాప్తిస్మము పొందుటవలన క్రీస్తు శరీరమైన ఆయన సంఘములో సభ్యుడవు కాగలవు.

—R. సామ్యూల్, అమలాపురం.

# దేవుని ఉనికి

## ( Existence of God )

దేవుడున్నాడని ఋజువు చేయుటకు బైబిలు ప్రయత్నించుట లేదు. ఆయన సృష్టికి ముందు ఉన్నవాడని బైబిలునందలి మొదటి వచనము స్పష్టము చేయుచున్నది. "ఆదియందు దేవుడు భూమ్యాకాశములను సృజించెను" ఆది (1 : 1). "యెహోవా" అను పదము 'ఎలోహీమ్' (Elohim) అను హెబ్రీ పదమునుండి అనువదింపబడినది. ఈ పదానికి "ఉన్నవాడు" అని అర్థం. ఆయన ఎల్లప్పుడు ఉన్నవాడు He is all present. "దేవునియొద్దకు వచ్చువాడు ఆయన యున్నాడనియు తన్ను వెదకువారికి ఫలము దయచేయువాడని నమ్మవలెను" (హెబ్రీ 11:6).

దేవుడు లేడనువారు బుద్ధిహీనులని బైబిలు చెప్పుచున్నది (కీర్త 53 : 1). సృష్టిలో మానవుడు కనుగొనిన రహస్యము లెన్నో ఉన్నవి. పరిశోధనలు జరిపి అతడు గ్రహించిన విషయాలు చాలా స్వల్పము. భూమి తన చుట్టూ తాను తిరుగుచు సూర్యునిచుట్టూ నిర్ణీతమైన వేగముతో నిర్ణీత కక్ష్యలో ఏ ప్రమాదము వాటిల్లకుండ క్రమముగ పరిభ్రమించునట్లు శాసించిన దెవరు? భూమియొక్క చలన గతిలో మార్పు వచ్చినట్లయితే ప్రకృతి భీభత్సములు సంభవించును. అట్టి ఘోర విపత్తు ప్రపంచానికంతటికీ జరుగకుండ సృష్టిని నడిపించుచున్న ఆ అధిపతి ఎవరు? సూర్యునికి భూమికి మధ్య సరియైన దూరమును నిర్ణయించి భూమిని నరులకు నివాసయోగ్యముగ చేసిన సృష్టికర్త ఎవరు? ఒక చిత్రము వెనుక చిత్రకారుడున్నాడు. చిత్రకారుడు లేకుండ చిత్రము లేదు. "There cannot be a design without a designer"—William Paley. సృష్టికర్త లేకుండ సృష్టి జరిగెనని చెప్పిన ఒక మానవుని మాటలు నమ్మతగినవా?

భూమి మిగిలిన గ్రహములు ఒకే "ప్రేలుడు" వల్ల ఉద్భవించినట్లయితే, భూమి, ప్రేలుడు ఫలితంగా కలిగిన ఒక శకలమైతే సూర్య

నికి నిర్ణీతమైన దూరములోనుండి నిర్దిష్టమైన కక్ష్యలో ఎట్లు పరిభ్రమించుచున్నది? భూమికి ఒక స్పష్టమైన ఆకారము ఎట్లు వచ్చెను? పరిణామ సిద్ధాంత ప్రకారము కాలము జీవుల పరిణామములో ఒక ప్రముఖ పాత్ర వహించెను. ఈ సిద్ధాంత ప్రకారము నిర్జీవ పదార్థము నుండి జీవపదార్థ ముద్భవించెను. అనంత కాలగమనములో నిర్జీవ పదార్థమునుండి జీవమునుండి జీవము పుట్టెనని, పరిణామము చెందెనని డార్విన్ వాదన. నిర్జీవ పదార్థము నుండి జీవ పదార్థము పుట్టునా ? ఇదెంత హాస్యాస్పదము.

ఒక ప్రముఖ దినపత్రిక నందు ఒక వ్యాసము ప్రచురించబడినది. మానవ చరిత్రను సాక్ష్యాధారాలతో వ్రాయుటకు 5000 సంవత్సరములు మించి వెనుకకు వెళ్ళి వ్రాయుట అసాధ్యమని ఆ వ్యాసము నందు పేర్కొనుట జరిగెను. 200 సంవత్సరముల క్రితము జీవించిన చార్లెస్ డార్విన్ 5 బిలియన్ల సంవత్సరముల క్రితము జరిగిన చరిత్రను వ్రాసెను. ఈ చరిత్ర లేదా జీవుల పరిణామము అతని మనస్సులో తళుక్కున మెరిసిన ఆలోచన. ఒక కట్టుకథ, ఊహాగానము. ఈ ఆలోచన గ్రంథ రూపము దాల్చి మానవులను కలవరపెట్టుచున్నది.

కోతి మానవునిగ పరిణామము చెందెనని ఈయన వాదన. మానవుడు ఒక జంతువేనని ఈ సిద్ధాంతముయొక్క సారాంశము. మొదటి మానవుని తల్లిదండ్రులు జంతువులని వీరి అభిప్రాయము. ఎప్పుడో కోతి మానవునిగ పరిణామము చెందితే ఇప్పుడు ఎందుకు జరుగుటలేదు ? ఇప్పుడు పరిణామము జరుగుటలేదు కనుక ఒకప్పుడు జరిగెనని ఎట్లు నమ్మగలము?

జంతువులయొక్క పరిణామక్రమములో వివిధ దశలను వివరించుటలో డార్విన్ విఫలుడయ్యెను. కొందరు పరిణామ సిద్ధాంతీకులు డార్విన్ చెప్పిన కాలముతో ఏకీభవించుటలేదు. భూమి వయస్సు

కొన్ని బిలియన్ల సంవత్సరములని వారి భావన. పరిణామ సిద్ధాంతీకులలో ఏకాభిప్రాయము లేదు.

## పరిణామ సిద్ధాంతము విజ్ఞాన శాస్త్రములో భాగంగా నుండుటకు అర్హతలేని సిద్ధాంతము

నేడు విజ్ఞాన శాస్త్రము మానవుని జీవితంలో మార్పును కలిగించెను. నేటి అభివృద్ధి, మనకున్న సాంకేతిక పరిజ్ఞానము విజ్ఞాన శాస్త్ర ఫలితమే. మేము విజ్ఞాన శాస్త్రము (science) విషయంలో గర్వించుచున్నాము. పరిశోధనలో ఋజువు చేయబడిన వాస్తవములే. విజ్ఞాన శాస్త్రము వాస్తవమని నేటివరకు నిరూపింపబడని పరిణామ సిద్ధాంతము విజ్ఞాన శాస్త్రము కాదు. ఒక మానవుని ఆలోచన అతని సిద్ధాంతము అనేకమంది ఆసక్తికరముగా కనబడవచ్చును. అది ఋజువు చేయబడాలి.

పరిణామ సిద్ధాంతము పరోక్షముగా దేవుడు లేడని చెప్పుచున్నది. "ఆయన అదృశ్యదేవుని స్వరూపియై సర్వసృష్టికి ఆదిసంభూతుడై యున్నాడు. ఏలయనగా ఆకాశమందున్నవియు, భూమియందున్నవియు దృశ్యమైనవిగాని అదృశ్యమైనవిగాని అవి సింహాసనములైనను, ప్రభుత్వములైనను ప్రధానులైనను అధికారములైనను సర్వమును ఆయన ద్వారాను ఆయనను బట్టియు సృజింపబడెను. ఆయన అన్నిటికంటె ముందుగా ఉన్నవాడు. ఆయనే సమస్తమునకు ఆధారభూతుడు". దేవత్వములో ఒకరైన క్రీస్తునుగూర్చి పౌలు కొలస్సీయులకు వ్రాసిన మాటలివి (కొలస్స 1:15-16).

మానవుడు ఒక జంతువు కాదని బైబిలు చెప్పుచున్నది. "దేవుడు తన స్వరూపమందు నరుని సృజించెను. దేవుని స్వరూపమందు వాని సృజించెను" ఆది 1:27. అక్షయమైన ఆత్మను మానవునికి దేవుడిచ్చెను.

జంతువులకు ఆత్మ లేదు. "మరియు యావద్భూమిమీద కాపురముండుటకు ఆయన యొకనినుండి ప్రతిజాతి మనుష్యులను సృష్టించి. వారు ఒకవేళ దేవునిని తడవులాడి కనుగొందురేమోయని తన్ను వెదకు నిమిత్తము నిర్ణయకాలములను వారి నివాస స్థలముయొక్క పొలిమేరలను ఏర్పరచెను. ఆయన మనలో ఎవనికిని దూరముగా ఉండువాడు కాడు. మనమాయన యందు బ్రతుకుచున్నాము, చలించుచున్నాము, ఉనికిని కలిగియున్నాము" (అపొ.కా. 17:26-28).

—E.K.V. ప్రసాదరావు, చెయ్యేరు.

—o—

## సత్యవాక్కు చదువరులకు విజ్ఞప్తి

సత్యవాక్కు పత్రిక ద్వారా గత పది సంవత్సరాలనుండి ప్రతి మాసము విడువక మీ గృహాన్ని దర్శించుచున్నాము. మరియు సత్యవాణి రేడియో కార్యక్రమం ద్వారా గత 14 సంవత్సరాలుగా ఇంచుమించు ప్రతిరోజు కొన్ని లక్షల గృహాలలో సువార్త అందించుచున్నాము. మేము ప్రచురించిన వివిధములైన ఆధ్యాత్మిక పుస్తకముల వలన అనేక వేలమంది ఆత్మీయంగా మేల్కొల్పబడ్డారనుటలో సందేహం లేదు. మాస పత్రికను చందా లేకుండగనే కొన్ని వేల మందికి పంపుచున్నాము. అట్లే పుస్తకాలు కరపత్రాలు వగయిరాకూడ అతి స్వల్ప ఖర్చుతో మీకందించగలుగుచున్నాము.

వీటన్నిటితోబాటు బైబిలు కరస్పాండెన్సు కోర్సు పనికూడ నిర్విరామంగా జరిగించబడుచున్నది. బైబిలు కరస్పాండెన్సు కోర్సులలో ఇప్పటికి ఇంచుమించు 5 లక్షలమంది చేరియున్నారు. ఉత్తర ప్రత్యుత్తరాలద్వారా బైబిలు నేర్చుకొనుచున్నారు.

పైన చెప్పబడిన ఈ పని అంతయు కాకినాడ స్కూల్ ఆఫ్ ప్రీచింగ్‌లోని ఒక చిన్న గదిలో నుండియు, జాషువా గూటంగారి

గృహమునుండియు జరిగించబడుచుండేది. అయితే దేవుని కృప వలన గత సంవత్సరం కాకినాడలో ఈ పని నిమిత్తము ఒక స్థలం కొనగలిగాము. ఆ స్థలంలోయున్న పాత బిల్డింగును పడగొట్టి ఒక క్రొత్త బిల్డింగును కట్టుచున్నాము. ఈ క్రొత్త బిల్డింగ్ లో సత్యవాణి, సత్యవాక్కు, కరస్పాండెన్సు కోర్సుల ఆఫీసులు మాత్రమే గాక స్థానిక సంఘ కూడికలకు ఒక ఆడిటోరియమ్ కూడ యుండును. లెక్చర్షిప్ లకు, సెమినార్ లకు ఉపయోగింపబడే ఒక పెద్ద ఆడిటోరిమ్ పై అంతస్థులో యుండును. మరియు కాకినాడకు వచ్చే బోధకులకు వసతి కల్పించబడును.

గత రెండు దశాబ్దాలకు పైగా మేము చేయుచున్న పనిద్వారా మీరు సంతృప్తి చెందినయెడల ఈ నూతన భవనమును నిర్మించుటలో మాకు చేయూత నీయండి. దేవుని నామ ఘనతకొరకు, క్రీస్తు రాజ్య విస్తరణకొరకు సంకల్పించిన ఈ భవన నిర్మాణము నిమిత్తమై మీ విరాళములు పంపించండి.

మీరు విరాళము పంపునపుడు అది భవన నిర్మాణ నిమిత్తము అని తప్పక తెలియజేయండి. విరాళములు పంపిన వారి పేర్లు జాబితా సత్యవాక్కులో ఎప్పటికప్పుడు ప్రచురించుచున్నాము. మీ కానుక స్వల్పమైనా, అధికమైనా ఘనంగా ఎంచబడును. మీ విరాళము నిను దిగువ చిరునామాకు పంపించండి. డ్రాఫ్టులు వగయిరా జాషువా గూటంగారి పేరున గాని, సత్యవాణి పేరునగాని పంపించండి. మాతో కలసి ప్రార్థించండి. వందనములు.

అడ్రసు :

**SATYA VANI,**
**Seshagirirao Street**
**KAKINADA-533004. (A.P.)**

# కాకినాడ బిల్డింగు విరాళముల జాబితా

| | |
|---|---|
| క్రీస్తుసంఘము, వాకలగరువు, R.N. మూర్తి గారి ద్వారా | 60-00 |
| G. ఫిలిప్పు, పొదిలి | 50-00 |
| Y. తాతారావు, బరంపురం, ఒరిస్సా | 150-00 |
| Ch. లలిత, కిష్టాపురం | 50-00 |
| R. జేమ్సు, ఎర్రగుంట్ల, కడప | 100-00 |
| D. దేవరాజు, బాచేపల్లి, కర్నూలు | 150-00 |
| G. దేవ సహాయం, గుంటూరు | 100-00 |
| T. ప్రకాశరావు, కొమరోల్ | 200-00 |
| వారా జాన్, భద్రాచలం | 200-00 |
| క్రీస్తు సంఘము, ముమ్మిడివరం పాల్ గూటంగారి ద్వారా | 260-00 |
| Ch. మార్కు, నాగిరెడ్డిపల్లి | 30-00 |
| J.V. మోజెస్, బిర్ మిత్రపూర్, ఒరిస్సా | 100-00 |
| P. శాంతమ్మ, కర్నూలు | 100-00 |
| B. సోమయ్య, సంకటి తిమ్మయ్యపల్లి | 20-00 |
| A. చంద్రలిమ్మా, కటక్, ఒరిస్సా | 200-00 |
| N. జేమ్సు, మర్రికుప్పం K.G.F. కర్ణాటక | 40-00 |
| S. మేత్యూ, ఎమ్మిగనూరు, కర్నూలు | 30-00 |
| క్రీస్తుసంఘం, ప్రేమానగరం, బొబ్బిలి S. ఫిలిప్పుగారి ద్వారా | 200-00 |
| శ్రీమతి ద్వారకా ప్రవీణ్, పెదనందిపాడు | 100-00 |
| K.J. సుదర్శనం, కుంటముక్కల | 500-00 |
| N. ప్రకాశరావు, రఘుదేవరపురం | 30-00 |
| K. శాంతారావు, కాకినాడ | 200-00 |

| | |
|---|---|
| N. జాన్, కొలత్తూర్, మద్రాస్ | 100-00 |
| M. కొండయ్య, ట్రిప్లికేన్, మద్రాసు | 20-00 |
| D. మోహనరావు, విజిల్ పేట, పేరాల | 20-00 |
| A. సుబ్బయ్య, రాయపురం, బెంగుళూర్ | 116-00 |
| I. చంద్రలీల, నెల్లూరు | 100-00 |
| P.S. రావు, సావరం, అమలాపురం | 50-00 |
| E. జాన్ సుబ్బారావు, కొవ్వూరు | 25-00 |
| K. పద్రిక్, మద్రాస్ | 500-00 |
| Ch. సుగుణరావు, V. సావరం, రాయవరం | 30-00 |
| నారాయణ, సత్యవతి, దూబచర్ల | 25-00 |
| B. పంతులు, కల్లూరు, ఖమ్మం జిల్లా | 20-00 |
| B. భాస్కర్, కల్లూరు ,, | 20-00 |
| B. అమరసింగ్, కల్లూరు ,, | 20-00 |
| నంబూరి యశోద, ఏలూరు | 10-00 |
| J. రూబేను, వనపర్తి, మహబూబ్ నగర్ జిల్లా | 30-00 |
| T. ప్రసాదరావు, మైలవరం | 300-00 |
| వెల్వడం క్రీస్తు సంఘము, T. ప్రసాదరావు ద్వారా | 200-00 |

---

## ఈ యేసు ఎవరు?

ఇంచుమించు రెండు వేల సంవత్సరముల క్రితము పాలస్తీనా దేశములో యూదా బెత్లెహేములో పరిశుద్ధాత్మ వలన మానవునిగా పుట్టి, బాల్యమునందే లేఖనముల నుద్దేశించి బోధించి, తల్లిదండ్రులకు విధేయుడై, యుక్తవయస్సునందు తండ్రి (దేవుని) చిత్తమును నెర వేర్చుటకై పరోపకారియై, అనేక ఆశ్చర్యకార్యములు చేసి, మానవ రక్షణార్థమై సిలువలో మరణించి, సమాధి చేయబడి మృత్యుంజయుడై మూడవ దినమున సమాధినుండి సజీవునిగా లేచిన ఈ యేసును మహా

త్ముడని, దైవ మానవుడని దేవుడని చెప్పక తప్పదు. ప్రపంచములో ఏ వ్యక్తితోను ఆయనను పోల్చలేము. ఆయన అద్వితీయుడు. కృపా, సత్యములు ఆయన శరీరమందు లీనమైయున్నవని యోహాను పలికెను (యోహా 1 : 14). మరియు ఆయన దేవునికి గల శ్రేష్ట లక్షణములు, సర్వ సంపూర్ణ తను కలిగినవాడు. "మృతులలోనుండి లేచుటలో ఆది సంభూతుడు" (కొలస్స 1:18).

"నేను మొదటివాడను కడపటివాడను, మృతుడనై యుంటిని గాని, ఇదిగో యుగ యుగములు సజీవుడనై యున్నాను. మరణముయొక్కయు పాతాళలోకము యొక్కయు తాళపు చెవులు నా స్వాధీనములో యున్నవి" (ప్రకటన 1:18) అని చెప్పినవాడాయనే.

ఈ యేసు సర్వసృష్టికి ఆది సంభూతుడు: "ఏలయనగా ఆకాశమందున్నవియు, భూమిమీదున్నవియు... సర్వమును ఆయన యందు సృజింపబడెను. సర్వమును ఆయన ద్వారాను ఆయనను బట్టియు సృజింపబడెను" (కొలస్స 1 : 15, 16). కనుక ఈ సృష్టికర్త యగు "కుమారునిద్వారా ప్రపంచములు నిర్మింపబడెను" (హెబ్రీ 1:2).

ఈయన దేవుని స్వరూపము కలిగినవాడు, దేవునితో సమానమైనవాడు (ఫిలిప్పీ 2 : 6). "దేవుడొక్కడే దేవునికి నరులకు మధ్యవర్తియుఒక్కడే. ఆయనే క్రీస్తు యేసను నరుడు" (1 తిమో 2:5).

ఈయన ప్రేమామయుడు కావుననే పాపము చేసి దేవునికి దూరముగా ఉన్న మానవుని యెడల ప్రేమను కలిగి అతనికి నిత్య జీవము ఇచ్చుటకై మానవునిగా జన్మించి ఎన్నో గొప్ప కార్యములు చేసెను. ఆయన జీవితములో ఎన్నడును పాపము చేయలేదు. ఆయన నోటను కపటము లేదు (1 పేతురు 2:22). "నాయందు పాపమున్నదని మీలో ఎవడు స్థాపించును?" (యోహాను 8 : 46). ఈ యేసు ఇట్టి సవాలును చేసినప్పుడు నీతిమంతులై మతధర్మకాండకు బద్ధులై యున్న యూదా మతాధికారులు నిశ్చేష్టులైరి.

ఈ యేసు మానవునిగా మానవ అవసరములను తెలిసికొని అనేకులకు సహాయము చేసెను. ఈ యేసు తాను దేవుని కుమారుడని నిరూపించుటకొరకు అనేక గొప్ప కార్యములు చేసెను. రోగులను బాగుచేసెను, దయ్యములు పట్టినవారిని, మూగవారిని స్వస్థపరచెను (మత్తయి 9 : 32-34). పక్షవాయువు గలవారిని, చెవిటివారిని బాగు చేసెను (మార్కు 7 : 31-37). కండ్లనిచ్చెను (మత్త 9:27-34). చని పోయిన లాజరును బ్రతికించెను (యోహాను 11:1-46). 5 రొట్టెలు 2 చిన్న చేపలతో 5000 మంది పురుషులకు (స్త్రీలు, పిల్లలు కాక) ఆహారము పెట్టెను (యోహాను 6 : 5-14). సముద్రముపై నడిచెను (మత్త 14 : 22-25). "ఈ యేసు చేసిన కార్యములు అనేకమైనవి ఇంకనూ కలవు. వాటిలో ప్రతిదానిని వివరించి వ్రాసిన యెడల అట్లు వ్రాయబడిన గ్రంథములకు భూలోకమైనను చాలదు" (యోహాను 21 : 25).

ఈ యేసు మానవుని రక్షణకొరకై తన ప్రాణము బలిగా అర్పించిన దయామయుడు. "ఏ భేదమును లేదు అందరును పాపముచేసి దేవుడనుగ్రహించు మహిమను పొందలేకపోవుచున్నారు" (రోమా 3:23). "పాపమువలన వచ్చు జీతం మరణం" (రోమా 6:23). "మీ దోషములు మీకును దేవునికిని అడ్డముగా వచ్చియున్నవి" (యెషయా 59 : 1-2). ఇట్టి స్థితిలో ఉన్న మానవుని రక్షించుటకై సిలువలో ఘోరమైన మరణము నొందెను.

ఈ యేసు మృత్యుంజయుడు. "పునరుత్థానమును జీవమును నేనే" (యోహా 11 : 25). దేవుని కుమారుడుగా మూడవ దినమున సమాధినుండి తిరిగి లేచెను.

ఈ యేసు సంఘమునకు శిరస్సు. "సంఘము అను శరీరమునకు ఆయనే శిరస్సు" (కొలస్స 1:18; ఎఫెసీ 5:23). సంఘము యేసుచే

స్థాపింపబడెను (మత్తయి 16 : 18). కావున సంఘమునకు మనుష్య నామములు, సంస్థల నామములు, ఇతర నామములు పెట్టరాదు. మానవ కల్పిత సంఘములలో ఉన్నవారు భిన్నమైన బోధలలో ఉన్నారని గుర్తెరిగి అట్టివాటిని విడచి క్రీస్తు సంఘములో సభ్యులుగా ఉండవలెను.

ఈ యేసు మార్గము, సత్యము, జీవమై యున్నాడు (యోహాను 14:1-6). ఈయన ఈలోకములో ఆకలిదప్పులు గలవాడుగా ఉండినా గాని అనేక మందికి ఆహారం పెట్టినవాడు (కీర్తనలు 14:6-7). ఆయన మానవునిగా నిద్రించెను గాని ఆయన కునుకడు నిద్రపోడు (కీర్తనలు 121 : 3). ఆయన దుఃఖించెను గాని ఆయన సంతోషమిచ్చువాడు (యెషయా 35:6).

ప్రియ చదువరీ, ఈ యేసు ఎవరో ఇంతవరకు తెలిసికొని యుంటివి. ఈ యేసును నేడే నీ రక్షకునిగా అంగీకరించుము (2 కొరిం 6 : 2). ఆయన యిచ్చు నిత్యజీవము కొరకు ఆయన మాట వినుము (మత్తయి 17 : 15). ఆయన మాటలు వినుటద్వారా నీకు విశ్వాసం కలుగును (రోమా 10:17). నీ మనస్సు మార్చుకొనుము (అపో.కా. 2:38). యేసు ప్రభువని నీ నోటితో ఒప్పుకొనుము (రోమా 10:9,10). పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము తీసికొనుము (మార్కు 16 : 16). ఈ యేసు నీకు శాంతి నిచ్చి ఆశీర్వదించును గాక ఆమేన్.

—డి. అబ్రహాం, నడిపూడి.

---

## పోకిరి తనము

పోకిరితనము చాలామందిలో కన్పించుచున్న చెడు లక్షణము. పనియేమి చేయకుండా తాను ఉన్నచోటనే అన్ని రకాల భోగాలు జర

గాలని అనుకొనేవానిని సోమరి అని అనవచ్చును. సోమరితనము ఒక పాపక్రియ అని బైబిలు చెప్పుచున్నది. అసలు సోమరితనము యొక్క ఉనికి ఏమిటో తెలిసికొనినయెడల అది యెట్టి ఘోరమైనదో తెలిసికొనగలము.

సోమరి గాఢముగా నిద్రపోవుటను ప్రేమించును. "సోమరితనము గాఢనిద్రలో పడవేయును" (సామెతలు 19:15). సోమరి నిద్రకు అంతము లేదు. "సోమరీ ఎందాక నీవు పండుకొని యుందువు? ఎప్పుడు నిద్ర లేచెదవు?" (సామెతలు 6:9). పెందలకడనే నిద్రలేచినవారికి పని చేయడానికి అనేకమైన పనులు కలవు.

సోమరి అన్నియు కలుగవలెనని ఆశించును: "సోమరి ఆశపడును గాని వాని ప్రాణమునకేమియు దొరకదు. శ్రద్ధగలవారి ప్రాణము పుష్టిగా ఉండును" (సామె 13:4). "వీటి వలన నీకు దరిద్రత పరుగెత్తికొని వచ్చును. ఆయుధస్థుడు వచ్చినట్లు లేమి నీ మీదికి వచ్చును" (సామె 24 : 34). పని చేయకుండా అన్ని కలుగవలెననుకొని వారికి ఇట్టిది సంభవించును.

సోమరి ఇతరులను బాధించువాడు. "సోమరి తనను పని పెట్టువారికి పండ్లకు పులుసువంటివాడు, కండ్లకు పొగవంటివాడు" (సామె 10:26). సోమరి జీవితమునిండా కష్టములే. "సోమరి మార్గము ముళ్ళకంచె..(సామె 15 : 19). సోమరి తాను తినుటకు ఆహారము సంపాదించుకొనలేడు". సోమరి వేటాడినను పట్టుకొనడు.. (సామె 12:27). కొందరు పనిచేయని సోమరులు అన్నీ మంచివే కావాలని ఆశిస్తారు. అయితే వారికేమియు దొరుకదు, కనుక వారేమి ఆశించలేరు.

సోమరి పనిచేయడు. "విత్తులు వేయు కాలమున సోమరి దున్నడు..." (సామె 20:4). "సోమరి చేతులు పనిచేయ నొల్లవు. వాని యిచ్ఛ వాని చంపును" (సామె 21:25). సోమరి పనిచేయకుండు

టకు అనేక సాకులు చెప్పును. "సోమరి బయట సింహమున్నది వీధు లలో నేను చంపబడుదును అనును" (సామె 22:13).

కొందరు సోమరులకు తినుటకు కూడా బద్ధకమే. "సోమరి పాత్రలో తన చెయ్యి ముంచును. నోటియొద్దకు దాని తిరిగి యెత్తుట కష్టమనుకొనును" (సామె 20 : 15). సోమరి తన దృష్టికి తానే జ్ఞాని ననుకొనును (సామె 26:16). సోమరి ఎప్పుడు ఇతరులకు సేవకుడుగానే ఉండును. "శ్రద్ధగా పనిచేయువారు ఏలుబడి చేయుదురు. సోమరులు వెట్టి పనులు చేయవలసి వచ్చును" (సామె 12:24).

సోమరితనమును దేవుడు సహింపడు. ఆయన ఆదియందు ఏదెను తోటను నిర్మించి దానిలో రకరకాల వృక్షాలను, నీటిని ఉంచెను. మానవుని నిర్మించి ఆతనిని ఏదెను తోటను కాచుటకును, సేద్యపరచుటకును ఉంచెను (ఆది 2:15). దీనిని బట్టి మానవుడు పని చేయవలెననునది దేవుని ఉద్దేశ్యము. దానికి భిన్నముగా చేయుట పాపమే.

ఒక తలాంతును తీసికొని దానిని భూమిలో దాచి అనగా కష్ట పడి పనిచేయని దాసుని యజమాని "సోమరివైన చెడ్డదాసుడా అని పిలిచెను" (మత్తయి 25:30). ఆసక్తి విషయములో మాంద్యులు కాక ఆత్మయందు తీవ్రతగలవారై ప్రభువును సేవించుడి అని (రోమా 12:10, 11) అపొస్తలుడైన పౌలు చెప్పుచున్నాడు.

ప్రభువు కార్యాభివృద్ధియందు ఆసక్తులమై యుండాలి. వాక్య మును ప్రకటించుటకు సమయమును వాయిదా వేయరాదు. సమయ మందును అసమయమందును ప్రయాస పడుమని పౌలు చెప్పుచున్నాడు (2 తిమోతి 4 : 2). మనకు సమయము దొరికినయెడల ప్రతీ తరుణ మును ఉపయోగించవలెను. దేవుని కొరకు మన సమయమును, మన శరీరమును, జీవితమును ఉపయోగించవలెను. ఎల్లప్పుడు పనిచేయుచున్న వానిగా దేవుడు గొప్ప ఉదాహరణగా ఉన్నాడు. ఆయన ఒక సెకను పనిచేయకపోతే ఈ సృష్టి యావత్తు నాశనమగును.

పనిచేయని వాడు భోజనమునకు పాత్రుడు కాదని పౌలు చెప్పు చున్నాడు. "మరియు మేము మీయొద్ద ఉన్నప్పుడు ఎవడైనను పని

చేయ నొల్లనియెడల వాడు భోజనము చేయకూడదని మీకు ఆజ్ఞాపించితిమి కదా! (2 థెస్స 3:10). "పనివాడు తన జీతమునకు పాత్రుడు" (1 తిమోతి 5:18). దేవుని కొరకు కష్టపడితే జీవాహారము దొరకును. శరీర రీతిగా కష్టపడితే ఆహారం దొరకును.

కనుక క్రైస్తవుడు సోమరి కాక కష్టపడి పనిచేయువాడై యుండాలి. తన అనుదిన జీవితాన్ని బైబిలును చదువుటతోను, సువార్తను ప్రకటించుటతోను నడుపుచున్నయెడల నిత్యజీవమును పొందగలడు. సోమరికి జ్ఞానము కలుగుటకు అల్పమైన చీమలవద్దకు వెళ్లుమని బైబిలు చెప్పుచున్నది (సామె. 6:6-9). అవి ఎంత గొప్పగా పనిచేయును. ఎల్లప్పుడు పనిచేయును. అందుచే వాటికి ఏ కాలమందైనను ఆహారము కొదువ ఉండదు. క్రైస్తవుడు కూడా పనితో కూడిన జీవితము జీవించిన యెడల ఆకలి గొనడు, జీతము పొందును. ★

—దేవరపల్లి చిరంజీవి,
కాకినాడ స్కూల్ ఆఫ్ ప్రీచింగ్.

---

Regd. No. H/KD—45/KD.H.O.

From
SATYA WAKKU
P.O. Box 80
KAKINADA-533 001

No.




To